# కన్నె మనసు

"చిత్ర"

సుజాత కన్ను మూసింది నిద్రపోవటానికి. ఎంత మర్చిపోదామన్నా కేశవనిమాత్రం మరువ లేకుండా వుంది. జరిగిన మధుర ఘడియలు మళ్ళా అదేరీతిగా జ్ఞాపకానికి ఒస్తున్నాయి. కేశవుడు సెలవులకి వచ్చాడు. అప్పుడుకూడా అతనిలో మార్పులేదు. ఇవాళ వాళ్ళ పనిమనిషి చెప్పేసరికి విని అమితాశ్చర్యపడింది. కేశవుడు మరొక సంబంధం చూస్తున్నాడని విన్నది. గుండె దడదడ లాడింది. గొంతులో తడి ఆరిపోయింది... ఈ మొగవాళ్ళంతా ముందు ఆడే తీపిమాటలు వేరు. చేసేపని వెనకది వేరు. ఒక్కసారి ఆతనిమీద కోపం, అసహ్యం అన్నీ ఏకమై అతన్ని వున్న పాటున పిల్చి తిడదామనుకుంది. కేశవుడి తల్లి నరరూప రాక్షసిలాగ యింట్లో అడ్డుగావుంది. మరెలాగ? మరి తనదగ్గర పెట్టిన ఒట్లు!...

సుజాత చాలా చురుకైనదీ తెలివైనదీను. కేశవుడిని ప్రయత్న పూర్వకంగా కలుసుకుని అన్నీ అడిగింది. కేశవుడు సుజాతను ఎంతగానో తప్పించు కుందామనుకున్నాడు. కాని కుదరలేదు. సుజాత అన్న ప్రతీపదంలోనూ తన ప్రేమ, అభిమానంతప్ప కేవలం మరొక వుద్దేశ్యంమటుకు కాదు.

"సుజాతా! నువ్వు అనుకున్నట్టుమాత్రం జరుగ నీయను. నేను ఎప్పుడూ ఒకటే చెప్తున్నాను. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటానని." ఇన్ని మాటలు తనంటే యీ ఒక్క జవాబు చెప్ప గల్గాడు. సుజాత మరింత మండిపడింది:

"అయితే యిలా మనిద్దరం విడిగా ఎన్నాళ్లుం డేది?..." అడిగింది ప్రశ్నపూర్వకంగా. కేశవుడు ఆకాశంకేసి ఒకమారు, వచ్చే పోయే జనాన్ని ఒకమారు చూశాడు.

"తెలీదా?పోనీ, నన్నేంచేయమన్నావో చెప్పు." అంది కొంచెం తేరుకుని. కేశవుడు నవ్వాడు. ఆ నవ్వు వేళాకోళంగా మటుకు కాదు. సుజాతకి కోపం ఎంచేత వచ్చిందో ఎలా పోతుందో తనకి తెలుసు.

"దీన్నిబట్టే తేలుతోంది. ఆడవాళ్ళకి ఎంత తొందరబాటు వుంటుందో... నీకు నామీద నమ్మకం చెదిరిపోతే నేనేం చెయ్యను? ఇదుగో నువ్వు ఏ ప్రమాణం చెయ్యమన్నా చేస్తాను. కేశ వుడు సుజాత పక్కన తప్పితే—" అని తిప్పేశాడు మధ్యలో. సుజాత నవ్వింది. ఆ నవ్వులో ఆనంద బాష్పాలు కేశవుడి చేతిమీద టప్ మని రాలాయి. "పిచ్చిపిల్ల" అని సణుక్కుంటూ వెళ్ళిపోయా డు.

* * *

చెల్లెలికి కొంత యింటిపని అప్పగించి సుజాత అక్కయ్య భవాని భర్త సమేతంగా బజారువెళ్ళింది. సుజాత పని చేసుకుంటూనే తన ఆలోచనల్లో మునిగి వుంది. నాన్నగారు రొజుకుంటూ వంటింటిదాకా వచ్చి మంచినీళ్ళడిగేవరకూ తనకు తెలివిరాలేదు. "ఎక్కడికెళ్ళావు నాన్నా యింత ఆయాస పడ్తూ వచ్చావు!..." అంది ఆశ్చర్యంగా.

"ఎక్కడికేమిటమ్మా... నారాయణపురం వెళ్ళి రావాల్సి వచ్చింది పనిమీద... అక్క ఎక్కడ?" అని అడిగారు ఖంగారుగా. లేదని తెలుసుకుని నిరుత్సాహ పడ్డారు.

"ఈ ఆడపిల్లలిద్దర్నీ వూరికే యింట్లో ఎలా కూర్చోపెట్టుకోను భవానీ?... నేను చూస్తే పెద్ద వాణ్ణయాను. శంభుకి యీ ఏటితో చదువుకూడా అఖరవుతుంది..." అన్నారు. సుజాత అన్నం వారుస్తూ ఆలాగే వుండిపోయింది కొయ్యబొమ్మ లాగ. కేశవుడి ప్రతిమ తన ఎదురుగా పలువిధము లైన ప్రశ్నలడుగుతూ ఎదురవుతోంది. అక్కయ్యతో చెప్పింది రహస్యంగా, కొంత సిగ్గుతోను. "అయితే యీ పెళ్ళి మరోకలాగున జరుగకూడదన్నమాట!" అంది భవాని అనాలోచితంగా.

"అంతే... నువ్వు ఆలా మాట్లాడ్డం మటుకు బాగోలేదు అక్కా!... నీయిష్టమొచ్చిన చీర కట్టుకోవచ్చు. వస్తువు పెట్టుకోవచ్చు గాని, యిది మాత్రం అలాకాదు..." అంది తెచ్చి పెట్టుకున్న

కోపంతో. అక్కయ్య యీ విషయం నాన్నతో చెప్పింది. నాన్నగారు ముక్కుమీద వేలేసుకున్నారు. "ఈ కేశవుడెవరే భవానీ!..." అన్నారు ఆశ్చర్యంగా. అక్కయ్య వారిగురించి చెప్పి కనుక్కొని రమ్మంది. సుజాత తండ్రి తెచ్చే కబురు కోసం నిరీక్షిస్తూ కూర్చుంది గంపెడాశతో...

నాన్నగారు వీధి సావిట్లో కుర్చీలో నిస్పృహతో కూర్చున్నారు. "వాళ్ళు ఏడాదిదాకా పెళ్ళిగురించి మాట్లాడరుట" అన్నారు. అక్కయ్యని అట్టేపెట్టేందుకు బావగారు యిష్టపడలేదు. అక్కయ్య కంట తడిపెట్టుకుంటూ వెళ్ళిపోయింది.

నాన్నగారు మర్నాటినుంచీ అన్నం ముట్టలేదు సమంగా. సుజాత యీ శిక్షమాత్రం అనుభవించలేక పోయింది. నాన్న తనకోసం యీ విధంగా అన్నపానాలు మాని బాధపడ్తూంటే తనే విధంగా సహించగలదు? తను ధైర్యంచేసి అక్కకి ఉత్తరం రాసింది మరొక కుర్రాడిని చూడవలసిందని. ఇప్పుడు తన హృదయంలో కేశవుడికి స్థానంలేదు. నీళ్ళు పోయకుండా ఎన్నాళ్ళు మొక్క తనంతతాను బతకగలదు? ఈ ప్రేమలతకి పోషణగాని, రూపంగాని ఏర్పడలేదు. మొలవేసిన మొలకలు వేసినట్టే వున్నాయి.

అక్కయ్య నాన్నగార్ని వెంటనే బయల్దేరి వూరురమ్మని కబురంపింది: వారం రోజుల్లో పిల్లాడు చూడటానికి వచ్చాడు. తనకి అపరిమితమైన సిగ్గు. పైగా పరాయి మగవాళ్ళని కన్నెత్తిచూసి కాని, మాట్లాడిగాని ఎరుగదు. పిల్లవాడు చూడ్డానికైతే బాగానేవున్నాడు. సుజాత సిగ్గుపడటం చూసి వాళ్ళు దురభిప్రాయపడ్డారు. సుజాత తన దురదృష్టాన్ని పదేపదే తలచుకుని బాధపడింది.

* * *

భవాని చంటిదాన్ని తీసుకుని పుట్టింటికివచ్చింది. సుజాత అదేవిధమైన మనోవేదనతో కాలం గడుపుతోంది. లక్ష్మిని చంకవేసుకుని తన స్నేహితురాలింటికి వెళ్ళింది సాయంత్రం. జానకి సుజాతను చూసి బ్రహ్మానందపడింది.

"నీ ఒంట్లో కులాసాయేనా సుజాతా? బొత్తిగా నీరసంగా ఉన్నావు!..." అంది విచారంగా. సుజాత దేనికీ జవాబీయలేదు. తను చెప్పేది కూడా ఏదీ లేదని తనకు తెలుసు. జానకి యింటి నుంచి వస్తూంటే మళ్ళీ కేశవుడు ఎదురయ్యాడు. సుజాత చూడనట్టే తల పక్కకు తిప్పుకుంది.

"సుజాతా! ... బొత్తిగా చూడకుండానే పోతున్నావు."

"నాతో మాట్లాడకు కేశవా...మగవాళ్ళకు దొరికినంత సులభంగా ఆడవాళ్ళకు వంకలు దొరకవు."

"మరి నువ్వూ మారావుగా!" అన్నాడు కోపంగా.

"ఇన్నాళ్ళు ఆదే విధంగా నడిస్తే బండరాతికి కూడా మార్పువస్తుంది. మార్పులేనిదీ ప్రపంచం లేదు..." అంది కొత్త సిద్ధాంతం కనిపెట్టినట్టు.

హంతకుడు ఎవర్నయితే చంపబోతాడో వారిమీద వానికి ప్రత్యేకం ఆ సమయంలో వుండేది కేవలం శత్రుత్వం తప్పితే మరేదికాదు. అంతమాత్రంచేత వాడిలో మానవత్వంగాని ప్రేమదృష్టికాని మరలిపోదు. ఇవన్నీ ఆలోచించి తర్కిస్తే తన పని నిర్వహించలేడు...సుజాత మర్నాడల్లా లేవలేదు. తన పని ముఖ్యంగా తండ్రి మనసును స్థిమితపర్చాలని, తన జీవితభారం మరొకవ్యక్తిపైనవేసి తను తేలికపడదామని ... శిలావిగ్రహాన్నిసైతం మార్పుతెచ్చే వుద్దేశ్యంతోనే పూజలు పునస్కారాలు చేస్తాం...మరిమానవుల్లోనే లేకపోతే వాళ్ళు రాళ్ళకన్నా గట్టిపదార్థాలతో చేయబడ్డారనమాట. సుజాత మనసుకి శాంతి లేదు. రోజు రోజుకూ క్షీణించి పోతోంది.

* * *

సుజాత తనను చూసిపోయిన కుర్రవాడిపేర చిన్న జాబురాసింది. తనని అపార్థం చేసుకోవద్దని, తను కేవలం సిగ్గుచేతనే ఆవేళ అలా కూర్చుందని. ఆ ఉత్తరం చదివి మధుసూధనుడు అమితాశ్చర్యపడ్డాడు. తను అందరి పిల్లల్ని చూసినట్టే వెళ్ళాడు సుజాతను చూసేందుకు. మరి క్షమాపణ పత్రం దేనికి!...అర్థంకాలేదు. మర్నాడు బయల్దేరి వెళ్ళి తండ్రితో చెప్పాడు తను మూడు నెలల క్రితం చూసిన సుజాతను చేసుకుంటానని.

"మరి ఆ పిల్ల నచ్చలేదన్నావుగా!..." అన్నారు తెరిచిన నోరు తెరిచినట్టే పెట్టి.

"యిప్పుడిష్టమయింది..." అన్నాడు బల్లగుద్ది మాట్లాడే లాయరులాగ. ఒదినగారూ అన్నయ్యా యీ మాట విని చకితులయ్యారు.

పది రోజుల్లో సుజాత మధుకి భార్యగా స్వీకరింపబడింది. తను భర్తకేసి కన్నెత్తి చూడలేకపోయింది. ఏదో పెద్ద అపచారం చేసినట్టు బాధపడసాగింది.

"ఏం సుజాతా! ... నీ ఉత్తరం నాన్నకూ అన్నయ్యకూ చూపెడితే ఏమయ్యేది?..." అన్నాడు నవ్వుతూ.

"పోనీ, నేను రాడీసనీ యింకా ఏదో అనుకునే వారు..." అంది నీరునిండిన నేత్రాల్తో.

"మరి ఆవేళ అలా కూర్చున్నావు!" అన్నాడు.

"అంతమందిలో నాకు చాలా సిగ్గేసింది..." అంది తప్పుచేసిన చంటిపిల్లవాడిలాగ. మధుసూదన తృప్తిగా నవ్వాడు. సుజాతకి భారం ఒక్కసారి తొలగిపోయినట్టయింది. ఇప్పుడు తనకి అండగా పెద్ద పర్వతమో, వృక్షమో నిలబడ్డట్టు తృప్తి పడింది.

---

# మూడవ కన్ను

బొమ్మకంటి శ్రీనివాసాచార్య

అమృత కవిత లల్లెడి మా హృదంతరమున
  కలదు మూడవ కన్ను; లోక జలరుహ తు
రీయ పరిమాణమును వివరించు కన్ను
సృష్టి తాత్త్విక రూపమ్ము నెరుగు కన్ను
        ధూమ జ్యోతి శ్శ్రిత ప
        యో మారుత సంనివేశ మొరులకు కానిం
        డా మబ్బున హరి దేహ
        శ్యామలతా మానదండ మగుపడు మాకున్
చెలియ వేనలి వోలె అళిపాళివలె అంజ
        నోర్వీభృత్ శిఖరమ ట్లొక్కమారు
దైవోపహతు రీతి, దావధూమము భాతి
        ఉదితావ మతి గతి నొక్కమారు
శివ గళాంక ప్రభన్ శ్రీవత్స మృదు శోభ
        ఉడురాట్కలంకాభ నొక్కమారు
బాష్ప కుండిక యౌచు, భయరూపమై, చల
        ద్దిక్కుంభి కుంభమై యొక్కమారు
        దర్శనమ్మిడు వివిధావతార మూర్తి
        జలధరము మా తృతీయలోచనము మ్రోల
        వరుస కోట్ల కవులు కొల్వ తరిగిపోవు
        జలధర తురీయ పరిమాణ సౌరభములు
ఒక్క మేఘమేమి? ఉర్విని గల సర్వ
వస్తుజాత మంటి వరలు—మబ్బు
వంటి ఒక తురీయ పరిమాణ మద్దాని
కని కనంగ జేయు కవి భువి రవి!
        లలిత కవితల గూర్చు మా కలము కొసల
        కలదు మూడవ కన్ను; జగము దివమ్ము
        సలుపగల కన్ను; హృది సుధల్ చిలుకు కన్ను
        మలగు కనుదమ్ములను విచ్చు వెలుగు కన్ను!